క్రైస్తవులు ఐక్యం కావాలి



దైవసేవకులను సన్మానిస్తున్న సభ్యులు

హిమాయత్‌నగర్ : క్రైస్తవులు ఐక్యంగా ఉండి ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్, పాస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు బిషప్ కె.తిమోతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోలమన్‌రాజ్ పిలుపు ఇచ్చారు. మంగళవారం నారాయణగూడలోని బాప్టిస్ట్ చర్చిలో 602 మంది దైవ సేవకులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రెవరెండ్ డాక్టర్ మెన్నో జోయల్, ప్రతినిధులు బెనోని రిచర్డ్, జయకుమార్, ప్రబోద్ విల్సన్, ప్రేంసాగర్, సురేశ్, హేమలత, షాలిని డేనియల్ పాల్గొన్నారు.

హెచ్ఎంపై చర్యలు తీసుకోవాలి

ఎంతవోకు ఫిర్యాదు చేసిన పత్రం చూపెడుతున్న పాఠశాల గౌరవ అధ్యక్షుడు జనార్దన్

శంషాబాద్ రూరల్, ఆగస్టు 27 : పాఠశాల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న హెచ్ఎంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ..మంగళవారం ఎంఈవో లక్ష్మణ్‌నాయక్‌కు ఫిర్యాదు చేసిన్నట్లు పాఠశాల గౌరవాధ్యక్షుడు వక్కంటి జనార్దన్ తెలిపారు. హుడా కాలనీ ప్రాథమిక పాఠశాలకు ఇటీవల జరిగిన బదిలీల్లో హెచ్ఎం పెర్షిస్, ఉపాధ్యాయుడు చక్రధర్ వచ్చారు. విద్యార్థులతో మూత్రశాలలు, పరిసరాలు పరిశుభ్రం చేయిస్తున్నారు. తాగునీరు అందించడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. తగరతి గదితో సెల్‌ఫోన్ వాడడంతో పాటు విద్యార్థులకు అవసరమైన విద్యబోధన చేయడంలేదని వివరించారు. పాఠశాల గౌరవాధ్యక్షుడినైన తాను పాఠశాలకు వెళ్లితే.. నీ పిల్లలు పాఠశాలలో లేరు. నువ్వు రావద్దుంటు హెచ్చరించిన్నట్లు తెలిపారు. హెచ్ఎం, ఉపాధ్యాయుడు చక్రధర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్సీ కవితకు బెయిల్.. నాయకుల్లో సంబురాలు

ఎమ్మెల్సీ కవితకు బెయిల్ మంజూరుతో శంషాబాద్ పట్టణంలో సంబురాలు చేసుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు

కవితకు బెయిల్ రావడంతో మంచిరేవుల చౌరస్తాలో సంబురాలు జరుపుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు

శంషాబాద్ రూరల్, ఆగస్టు 27 : ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ నాయకురాలు కవితకు బెయిల్ మంజూరుపై బీఆర్ఎస్ నాయకులు మంగళవారం శంషాబాద్‌లో సంబురాలు జరుపుకున్నారు. పటాకులు కాల్చి, స్వీట్లు పంచుకున్నారు. వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నాయకురాలు, ఎమ్మెలీ కవితకు బెయిల్ రావడం సంతోషంగా ఉన్నదని, లిక్కర్ కేసులో ఆధారాలు లేకపోవడంతో ఒక్కరూపాయి రికవరీ చేయలేదన్నారు. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌తో పాటు కేసీఆర్‌పై కక్ష పూరితంగా వ్యవహరిస్తూ మరోసారి అధికారంలోకి వచ్చారని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వం వారికి వ్యతిరేకంగా ఉన్న నాయకులకు ఈడీ పేరుతో కక్ష సాధింపు చర్యలకు పూనుకున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బుర్కుంట సతీశ్, దిద్యాల శ్రీనివాస్, మంచర్ల మోహన్ రావు, చిన్నగుండు రాజేందర్, కుంచే జంగయ్య, కొమ్మ గోపాల్, లింగంశ్రీశైలం, జీ అశోక్, హరికృష్ణ, గుంటి చరణ్, రోడ్డ రాజు పాల్గొన్నారు.

మంచిరేవుల చౌరస్తాలో నాయకుల ఆధ్వర్యంలో..

మణికొండ, ఆగస్టు 27: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి పరిచయం చేసిన నాయకురాలు కల్వకుంట్ల కవిత అని మంచిరేవుల బీఆర్ఎస్ నాయకులు కొనియాడారు. కవితకు బెయిల్ రావడంతో మంగళవారం మంచిరేవుల చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి సంబురాలు జరుపుకున్నారు. వారు మాట్లాడుతూ.. అక్రమంగా కేసులు బనాయిస్తూ కేంద్ర ప్రభుత్వం కల్వకుంట్ల కవితను జైలులో పెట్టిందన్నారు. నిజం ఎప్పటికైనా గెలుస్తుందన్నారు. ప్రజలకు మంచి చేసే వారిపైనే బీజేపీ పగబడుతూ ఓ మహిళ అని కూడా చూడకుండా అక్రమంగా కేసులు నమోదు చేయించారన్నారు. రానున్న రోజుల్లో ప్రజలే వారికి గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సి.హెచ్.సాయికుమార్, వినోద్, స్వామి, జైరామ్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితను కుట్రపూరితంగా అరెస్టు చేశారు

మైలార్‌దేవ్‌పల్లి, ఆగస్టు 27 : బీఆర్ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను కుట్రపూరితంగా అరెస్టు చేశారని అత్తాపూర్ డివిజన్ బీఆర్ఎస్ ఉపాధ్యక్షులు కొత్తూరు మల్లేశ్ అన్నారు. మంగళవారం కవితకు సుప్రీంకోర్టులో బెయిల్ లభించడంతో హర్షం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఓర్వలేకనే ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేశారన్నారు. మహిళ, ఎమ్మెల్సీ అని చూడకుండా అరెస్టు చేయడం శోచనీయమన్నారు. అంతిమంగా న్యాయం గెలిచిందన్నారు. ప్రభుత్వంలో ఉన్న వ్యక్తులు కుట్రలు, కుతంత్రాలు తెప్పికోట్టే విధంగా కోర్టు పలు అంశాలను వెల్లడించిందన్నారు.

బీసీల ఉద్యమాలకు మద్దతివ్వండి

హిమాయత్ నగర్‌లోని మఖ్దుంభవన్‌లో ఎమ్మెల్యే కూనంనేనికి ఆహ్వాన పత్రం అందజేస్తున్న గుజ్జ కృష్ణ

హిమాయత్‌నగర్, ఆగస్టు 27 : జాతీయ బీసీ సంక్షేమ సంఘం చేసే ఉద్యమాలకు మద్దతివ్వాలని 29న జరిగే అఖిలపక్ష సమావేశానికి హాజరు కావాలని కోరుతూ.. మంగళవారం హిమాయత్ నగర్‌లోని మఖ్దుం భవన్‌లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ కలిసి ఆహ్వాన పత్రం అందజేశారు. గుజ్జ కృష్ణ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టి కేంద్రంలో బీసీలకు ప్రత్యేక శాఖ కేటాయించాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. లక్డికాపూల్‌లోని సెంట్రల్ కోర్టు హోటల్‌లో రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో జరిగే జాతీయ సదస్సుకు బీసీలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సాంబశివరావు సానుకూలంగా స్పందించి బీసీలకు సీపీఐ అండగా ఉంటూ వారి హక్కుల కోసం జరిగే ఉద్యమాల్లో భాగస్వామ్యం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు నందగోపాల్, వేముల రామకృష్ణ, ఉదయ్ పాల్గొన్నారు.

వేడుకల్లో ఉట్టి కొడుతున్న చిన్నారులు



అఖిల భారత యాదవ సంఘం ఆధ్వర్యంలో జ్ఞాపికలు, ప్రశంస పత్రాలు అందజేస్తున్న దృశ్యం

విజయవంతంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

మైలార్‌దేవ్‌పల్లి, ఆగస్టు 27 : మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అఖిల భారత యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలను కనుల పండుగగా నిర్వహించారు. శ్రీ కృష్ణుడికి పూజలు నిర్వహించి సంఘం ఆధ్వర్యంలో ఉట్టి కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారి బాలబాలికలు గోపికలు, చిన్ని కృష్ణుడి వేషధారణలో దర్శనమిచ్చారు. సంఘం సభ్యులు ప్రతి సంవత్సరం కృష్ణాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం అధ్యక్షులు అక్కేం పెద్దకృష్ణయాదవ్, రాముయాదవ్, తోట మహేందర్ యాదవ్, బండా రాజేశ్ యాదవ్, గోల్కొండ రాము యాదవ్, రఘు యాదవ్, విజయ్ కుమార్, నరేశ్ యాదవ్, కుమార్ యాదవ్, మనోజ్ యాదవ్, కార్తీక్ యాదవ్ పాల్గొన్నారు.

నిమజ్జనానికి ఏర్పాట్లు చేయాలి

కాముని చెరువును పరిశీలిస్తున్న డీసీపీ రాజేశ్, వివిధ శాఖల అధికారులు

శంషాబాద్ రూరల్, ఆగస్టు 27 : వినాయక నిమజ్జనం కోసం కాముని చెరువు వద్ద ఏర్పాట్లు పూర్తి చేయాలని శంషాబాద్ జోన్ డీసీపీ రాజేశ్ సూచించారు. మంగళవారం శంషాబాద్ మున్సిపాలిటీ అధికారులు, రెవెన్యూ, పోలీస్ అధికారులతో కలిసి డీసీపీ కాముని చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. లైట్లు, క్రేన్లు ఏర్పాటు చేసి భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. శంషాబాద్ పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చే వినాయక విగ్రహాలను సైతం కాముని చెరువులో నిమజ్జనం చేసుకునే అవకాశం ఉండే విధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. చెరువును పరిశీలించిన వారిలో శంషాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌రావు, సీఐలు బాలరాజు, నరేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు, శానిటేషన్ అధికారి లక్ష్మయ్య, రెవెన్యూ అధికారులున్నారు.

ఆ అధికారుల బదిలీలెప్పుడో..?

'ఖైరతాబాద్ జోనల్' లో కొందరు ఏండ్ల తరబడి తిష్ట

ఖైరతాబాద్ జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయం

ఖైరతాబాద్, ఆగస్టు 27 : బల్దియాలో ఇటీవల చేపట్టిన బదిలీల్లో ఖైరతాబాద్ జోనల్ ఆఫీస్‌లో కొందరు అధికారులు ఎందుకు లేరు.. ఏండ్ల తరబడి ఒకే కార్యాలయంలో తిష్టవేసి పలు ఆరోపణలు ఎదుర్కొంటున్నా.. వారికి స్థానచలనం ఎందుకు కావడం లేదు.? క్యా మతలబ్ హై అంటూ.. ఉద్యోగవర్గాల్లో చర్చ జరుగుతున్నది. జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కార్యాలయంలో పనిచేస్తున్న కొందరు అధికారులు బదిలీలు మినహాయించుకొని ఇక్కడే దీర్ఘకాలికంగా పనిచేస్తున్నారు. ఇటీవల గ్రేటర్ హైదరాబాద్ మున్సిపాలిటీలో కమిషనర్ ఆమ్రపాలి ఒకేసారి 21 మంది అధికారులను బదిలీ చేశారు. గతంలోనే బదిలీల ప్రక్రియలో కొన్ని విభాగాలకు చెందిన వారికి స్థానచలనం కలిగింది. అయితే ఖైరతాబాద్ జోనల్ కార్యాలయంలోని ఇంజినీరింగ్ విభాగంతో పాటు కొందరు ట్యాక్స్, చైన్‌మెన్లు ఏండ్ల తరబడి ఒకేచోట ఉన్నా ఉన్నతాధికారులు ఎందుకు దృష్టి సారించడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. బదిలీలను తప్పించుకునే అధికారులపై బల్దియా కమిషనర్ దృష్టిపెట్టాలని పలువురు కోరుతున్నారు.

కబ్జాకు గురైన భూములు స్వాధీనం చేసుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఇస్లాముద్దీన్

ఖైరతాబాద్, ఆగస్టు 27 : కబ్జాకు గురైన దేవాదాయ, వక్ఫ్‌బోర్డు భూములను హైడ్రా స్వాధీనం చేసుకోవాలని, ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని ఆల్ ఇండియా ముస్లిం రిజర్వేషన్ పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మహ్మద్ ఇస్లాముద్దీన్ డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం, నగరంలో వక్ఫ్‌బోర్డు, దేవాదాయ శాఖకు చెందిన వేలాది ఎకరాలు కబ్జాలకు గురయ్యాయన్నారు. హైడ్రా రాకతో కబ్జాదారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని, ఎవరూ చేయని సాహసం సీఎం రేవంత్ రెడ్డి చేశారన్నారు. హోట్లళ్లలో కలుషిత, నాసిరకమైన, కల్తీ ఆహారంపై చర్యలు, డ్రగ్స్, గంజాయి అమ్మకాలపై ఉక్కుపాదం స్వాగతించాల్సిందేనన్నారు. హైడ్రాకు వ్యతిరేకంగా పాతనగరంలో ప్రజలను ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ రెచ్చగొడుతున్నారని, కానీ.. అక్కడి ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. జీహెచ్ఎంసీ కార్యాలయం ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందని ఆరోపిస్తున్న అసదుద్దీన్ స్కూళ్ల పేరుతో చేసిన కబ్జా మాటేమిటని ప్రశ్నించారు. దీనిపై విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో ఆలిండియా ముస్లిం రిజర్వేషన్ పోరాట సమితి ప్రధాన కార్యదర్శి ఖలీల్, ఎంకే వహీదుద్దీన్, అహ్మద్, ఇస్మాయిల్ , జయరాజ్ పాల్గొన్నారు.

సకాలంలో పూర్తి చేయాలి

సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సంగీతగౌరీశంకర్

మైలార్‌దేవ్‌పల్లి : అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పూర్తి చేయాలని అత్తాపూర్ కార్పొరేటర్ మోండ్ర సంగీతగౌరీశంకర్ అన్నారు. మంగళవారం హుడా కాలనీలో ఐదు లక్ష రూపాయలతో సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ ప్రారంభించారు. కాంట్రాక్టర్, అధికారులు పర్యవేక్షణ జరుపాలని సూచించారు. సమస్యలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో నూతన సీసీ రోడ్లు వేస్తున్నామన్నారు. డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. బీఆర్ఎస్ నాయకులు వనం శ్రీరామ్‌రెడ్డి, బీజేపీ నాయకులు బిట్కూరి సిద్ధేశ్వర్, ఎల్.వెంకటేశ్, హనుమంతరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు అండగా ఉంటా..

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అండగా ఉంటానని మణికొండ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి అన్నారు. మణికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 300 మంది విద్యార్థులకు తన సొంత ఖర్చుతో రవాణా సౌకర్యాం కోసం బస్‌పాస్‌లను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం నిరంజన్, ఉపాధ్యాయులు కిరణ్, హెచ్ సీయూ డిపో సూపరింటెండెంట్ లక్ష్మి, మధు, బాబూరావు, రవి, మణికొండ బీజేపీ మున్సిపల్ అధ్యక్షులు సి.బీరప్ప, మాజీ ఎంపీటీసీ రాఘవరెడ్డి, నాయకులు రవికాంత్‌రెడ్డి, బీజేపీ బీసీ విభాగం నాయకులు శివ కుమార్, బాల్‌రెడ్డి, శివరాంరెడ్డి, బి.సదానందం, బి.సురేశ్ పాల్గొన్నారు.

- మణికొండ

ఆలయ పునర్నిర్మాణానికి లక్ష విరాళం

నార్సింగిలోని శ్రీ చిదంబరేశ్వర భక్త సమాజం ఆధ్వర్యంలో పునర్నిర్మాణం చేస్తున్న నార్సింగి శివాలయం, శ్రీ సీతారామాంజనేయ ఆలయ నిర్మాణానికి మంగళవారం నార్సింగికి చెందిన భక్తుడు బనాల సురేశ్‌చారి లక్ష రూపాయల విరాళం అందజేశారు. చైర్మన్ జి.వెంకటేశ్ యాదవ్, వైస్ ప్రెసిడెంట్ వినోద్‌కుమార్, అధ్యక్షుడు కె.రవీందర్‌రెడ్డి ఈ సందర్భంగా సురేశ్‌చారికి కృతజ్ఞతలు తెలిపి శాలువాతో సన్మానించారు. దాతలు ముందుకు వచ్చి నిర్మాణానికి సహకరిస్తున్నారన్నాని, త్వరలోనే నిర్మాణ పనులను పూర్తి చేస్తామని ఆలయ కమిటీ సభ్యులు అన్నారు.

- మణికొండ

ఎమ్మెస్సీ మాలిక్యులార్ జెనిటిక్స్ పరీక్షా తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 27: ఓయూ పరిధిలోని ఎమ్మెస్సీ మాలిక్యులార్ అండ్ హ్యూమన్ జెనిటిక్స్ పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు నాలుగో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈ నెల 31వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania .ac.in లో చూసుకోవచ్చని సూచించారు.

ఎంసీఏ పరీక్షా తేదీల మార్పు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 27: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంసీఏ పరీక్షా తేదీలను మార్చినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంసీఏ (సీబీసీఎస్) (రెండేళ్ల కోర్సు) రెండు, నాలుగో సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈ నెల 30వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించామని చెప్పారు. అదే రోజు పరీక్షలు ప్రారంభమవుతున్నప్పటికీ, ఇతర పరీక్షా తేదీలను మార్చినట్లు చెప్పారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania. ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

కానిస్టేబుల్‌ను కులం పేరుతో దూషించి దాడి

పరస్పరం ఫిర్యాదులతో ఇరువర్గాలపై కేసులు నమోదు

వెంగళరావునగర్, ఆగస్టు 27 : కానిస్టేబుల్‌ను కులం పేరుతో దూషించి మందుబాబులు దాడికి పాల్పడ్డారు. తనపైనే కానిస్టేబుల్ దాడి చేసి గాయపర్చాడంటూ ఇచ్చిన ఫిర్యాదుతో ఇరువర్గాలపై మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. జవహర్‌నగర్‌కు చెందిన కానిస్టేబుల్ రాకేశ్ కార్ హెడ్ క్వార్టర్స్ కానిస్టేబుల్. బోరబండ పోలీస్‌స్టేషన్‌కు అటాచ్డ్‌గా ఉండి విధులు నిర్వహిస్తుంటారు. సోమవారం అర్ధరాత్రి కానిస్టేబుల్ రాకేశ్, రాజ్‌కుమార్, సుధీర్, నవీన్‌తో కలిసి దాబాకు వెళ్లి కారులో తిరిగి ఇంటికి బయలుదేరారు. కారును కృష్ణకాంత్ పార్క్ వద్ద పార్కింగ్ చేసి నడుచుకుంటూ వెళ్తుండగా.. వీరిలో నవీన్‌ను జవహర్‌నగర్ బస్తీకి చెందిన శివ పిలిచాడు. అటుగా వెళ్లే కానిస్టేబుల్ రాకేశ్‌ను కులం పేరుతో మద్యంమత్తులో ఉన్న శివ దుర్భాషలాడాడు. రాకేశ్‌తో శివ, కార్తీక్ ఘర్షణకు దిగి దాడి చేశారు. తనపైనే కానిస్టేబుల్ రాకేశ్ దాడి చేశాడని.. తన కంటి అద్దాలు పగిలిపోయాయని .. తనకు కుట్లుపడ్డాయంటూ శివ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పరస్పరం చేసుకున్న ఫిర్యాదులతో ఇరువర్గాలపై కేసులు నమోదు చేసుకుని మధురానగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగ కల్పనపై అవగాహన పెంచుకోవాలి

హిమాయత్‌నగర్, ఆగస్టు 27 : విద్యార్థులు తాము ఎంచుకున్న రంగంలో అవగాహన పెంచుకోవాలని బాబు జగ్జీవన్‌రామ్(బీజేఆర్) ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ్‌కుమార్ అన్నారు. నూతన పారిశ్రామిక కల్పనను ఏర్పచుకుని వ్యాపారాలను సృష్టించుకునే అవకాశం ఉంటుందని సూచించారు. మంగళవారం నారాయణగూడలోని బీజేఆర్ డిగ్రీ కాలేజీలో తృతీయ సంవత్సరం విద్యార్థులకు ఔత్సాహికత్వం, వ్యవస్థాపకత్వంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఉద్యోగం కంటే వ్యవస్థలను స్థాపించి ఇతరులకు ఉద్యోగాలను కల్పించే ప్రయత్నం చేయాలని సూచించారు. నూతన వ్యవస్థలను ఏ విధంగా ప్రారంభించాలనే విషయంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో టెంపో ఉపాధ్యక్షుడు రణధీర్‌రెడ్డి, సభ్యుడు అశోక్, ప్రతినిధి నరసింహులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

దైవ చింతనను అలవర్చుకోవాలి

హిమాయత్‌నగర్,ఆగస్టు 27 : దైవ చింతనను అలవర్చు కోవాలని భూలక్ష్మి ఆలయ కమిటీ అధ్యక్షుడు తోట శివ కుమార్ ముదిరాజ్ అన్నారు. శ్రావణ మంగళవారం సందర్భంగా గాంధీకుటీర్, నారాయణగూడలోని భూలక్ష్మి దుర్గాదేవి ఆలయంలో 400 కిలోల వివిధ రకాల కూరగాయాలతో అమ్మ వారిని అలంకరించి, పూజలు చేశారు. అష్టలక్ష్మి హోమం అనంతరం అన్న దాన కార్యక్రమం చేశారు. కార్యక్రమంలో భూలక్ష్మి ఆలయ కమిటీ చైర్మన్లు ఐలమ్మ,శ్రీనివాస ప్రసాద్, సలహాదారు సంధ్య, సభ్యుడు దాసు పాల్గొన్నారు.